సాక్షి
అనకాపల్లి
శుక్రవారం, 23, జూన్, 2023



రౌడీషీటర్ హత్య
అనకాపల్లి మండలంలో తలదాచుకున్న విశాఖకు చెందిన రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. 8లో



ఎన్నాళ్లో వేచిన ఉదయం
వందేళ్ల నాటి రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. ఆరిల్లోవ రోడ్డు పనులు పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 8లో



జీలుగులోవలో విషజ్వరాలు
కల్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతమైన శివారు కొండపై పలువురికి విషజ్వరాలు సోకాయి. 8లో

న్యూస్‌రీల్

వరాహ రూపంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

అనకాపల్లిటౌన్: స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

ఆర్టీసీ అడ్వాన్స్ బుకింగ్‌పై 10 శాతం రాయితీ

నర్సీపట్నం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుగా టిక్కెట్లు బుకింగ్ చేసుకునే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు రాను, పోను ప్రయాణానికి ముందుగా టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడం ద్వారా ఈ రాయితీ సౌకర్యాన్ని పొందవచ్చన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో మరో 58 మందికి బదిలీ

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్య శాఖ జోన్ వన్ పరిధిలో గురువారం మల్టీ పర్పస్ హెల్త్ సర్వీస్(ఎంపీహెచ్‌ఎస్-మేల్), మల్టీ పర్పస్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎంపీహెచ్‌ఈవో)లకు కౌన్సెలింగ్ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాలోని ఉద్యోగులకు బదిలీలు చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశాల ప్రకారం ఏపీజీఈఏ ఆఫీస్ బేరర్లకు రిటెన్షన్ (వారి స్థానంలోనే ఉండిపోవడం) అవకాశం ఇచ్చారు. ఎంపీహెచ్(మేల్) క్యాడర్‌లో 9 మంది, ఎంపీహెచ్‌ఈవో క్యాడర్‌లో 12 మంది రిటెన్షన్ పొందారు. మొత్తంగా గురువారం ఎంపీహెచ్(మేల్)లో 38 మంది, ఎంపీహెచ్‌ఈవోలో 20 మందికి బదిలీలు జరిగాయి.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 2,4,6,8,10,12,14,16,18,20,22, 24, 26,28,30 తేదీల్లోను, కిరండూల్ -విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 3,5,7,9,11,13,15,17,19,21,23,25, 27,29, 31 తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా ఏర్పాటుచేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు శ్రీకారం

- వర్షాలు కురవడంతో ప్రారంభమైన వరి నారుమడులు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- ఆర్బీకేల్లో ఇప్పటికే జోరుగా విత్తనాల పంపిణీ
- ఈ ఏడాది జిల్లాలో పెరగనున్న వరి విస్తీర్ణం



పల్లం ప్రాంతంలో ఇప్పటికే వేసిన వరి నారుమడి

చోడవరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పొలం పనులు ముందుగానే ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులంతా నారుమడులు సిద్ధం చేసే పనిలో బిజీ అయ్యారు. గ్రామాలన్నీ వ్యవసాయ పనులతో సందడిగా మారాయి. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం కూడా పెరగనుంది. సుమారు 5 నుంచి 7 వేల ఎకరాల వరకూ వరి విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరకు, సరుగుడు, ఇతర పంటల స్థానంలో ఈ ఏడాది వరి వేసేందుకు రైతులు ఆసక్తి చూపడంతో జిల్లాలో వరి సాగు ఆశాజనకంగా పెరగనుంది. రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. వ్యవసాయ బోర్లు, జలాశయాలు ఆయకట్టు భూముల్లో రైతుల కొందరు తమ వద్ద ఉన్న సొంత విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో సిత్త చేసి జల్లుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 55 వేల హెక్టార్లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా అదనంగా మరో 5 నుంచి 7 వేల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రతీ గ్రామ ఆర్బీకేల్లోనూ గత ఏడాది కంటే ఈ ఏడాది రైతులు అదనపు విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది సాధారణ రకాల వైపు వెళ్లకుండా బీపీ రకాలైన సోనామసూరి, ఆర్‌జీఎల్ రకాలకే రైతులు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు. గత ఎనిమిదేళ్లుగా జిల్లాలో చెరకు విస్తీర్ణం బాగా తగ్గిపోగా ప్రత్యామ్నాయంగా సరుగుడు, ఇతర పంటలు వేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వరిలో చాలా మంచి దిగుబడి రావడం, ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా మిల్లర్లను గ్రామాలకు రప్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అమ్మిన ధాన్యానికి సకాలంలో రైతుల ఖాతాల్లో మంచి గిట్టుబాటు ధరతో డబ్బులు జమ చేయడంతో రైతుల్లో వరి సాగుపై ఆసక్తి పెరిగింది. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించడం, వ్యవసాయ పెట్టుబడులకు ఇచ్చే రూ.13,500లలో ఈ ఏడాది మొదటి విడతగా ఇప్పటికే రూ.5500 ఇవ్వడం, గిట్టుబాటు ధర ఇచ్చేందుకు 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. రైతు సంఘాలకు రైతు రథం పేరుతో వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను సబ్సిడీపై అందించడంతో వ్యవసాయదారులకు ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో వ్యవసాయాధారిత ప్రాంతమైన చోడవరం, మాడుగుల నియోజకవర్గాలతోపాటు పాయకరావుపేట, నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల పరిధిలో చెరకు, సరుగుడు సాగు చేసే భూముల్లో సైతం ఈ ఏడాది వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. గతంలో మాదిరిగా కాకుండా ముందుగానే కావలసినంత విత్తనాలను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. లైసెన్సుతో నడిచే ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో కూడా వరి విత్తనాలు అమ్మకాలు ప్రారంభించారు.

ప్రభుత్వమే గ్రామాలకు వచ్చింది



గతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందంటే విత్తనాల కోసం వ్యవసాయశాఖ, ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద రోజుల తరబడి లైన్లలో నిలబడి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్యే లేదు. ప్రభుత్వమే గ్రామాల్లోకి వచ్చింది. గ్రామ సచివాలయాలు ఉన్న చోట రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రభుత్వమే విత్తనాలు అందిస్తోంది. ఖరీఫ్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం కింద మొదటి విడతగా డబ్బులు రైతు ఖాతాల్లో జమ చేశారు. ఇంతకంటే రైతుకి ఏమి కావాలి.

– వేచలపు దేముడు, రైతు, లక్కవరం

రైతుల్లో ఉత్సాహం



జిల్లాలో వరి సాగు ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. గ్రామాల్లో వరి వేసేందుకు రైతులు చాలా ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది సొంత విత్తనాలు సిద్ధం చేసుకోగా కొత్తగా వరి వేసే రైతులు కూడా ఈ ఏడాది ఆర్బీకేల్లో విత్తనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చెరకు, సరుగుడికి ప్రత్యామ్నాయంగా వరిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నారుమడులు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు కూడా కావలసిన మేరకు సరఫరా చేశాం.

– బి.మోహనరావు, వ్యవసాయ శాఖ జిల్లా

హర్ ఘర్ జల్ గ్రామంగా చినజగ్గంపేట



చినజగ్గంపేటను హర్ ఘర్ జల్ గ్రామంగా ధ్రువీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.27 కోట్లతో 137 పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ చెప్పారు. చిన జగ్గంపేట గ్రామంలో శత శాతం ఇళ్లకు కుళాయిలు వేయడంతో హర్ ఘర్ జల్ గ్రామంగా గురువారం ఎంపీడీవో, సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రకటించామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో 40 పైగా పనులకు టెండర్లు ఖరారు చేసి ఇంటింటికీ కుళాయి పనులు చేస్తున్నామన్నారు. మిగతా పనులు టెండర్ల ప్రక్రియ దశలో ఉన్నాయన్నారు. కొండల మీదనున్న గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతిపాదనలు చేశామని, అవి కూడా టెండర్ల దశలో ఉన్నాయన్నారు. చిన జగ్గంపేట గ్రామంలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. తర్వాత జగనన్న లేఅవుట్లలో తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఎంపీడీవో హనుమంతరావు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఇన్‌చార్జి జీవోపీఆర్‌డీ చినబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యా విప్లవం... సంస్కరణల పథం

ఫ్యాక్ట్ చెక్

పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువేనని ప్రతి క్షణం నమ్మి విద్యా రంగంలో ఎవరూ ఊహించని విధంగా మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి సత్ఫలితాలు ఇస్తోంది. ఈ ఏడాదిలో పది, ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదిలో స్టేట్ టాపర్లుగా అచ్యుతాపురానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థిని నిలవడం గమనార్హం. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లలో సైతం కొన్నింటికి మాత్రమే అందుబాటులో ఉన్న ఎడ్యుటెక్ విద్యను 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అందరికీ అందుబాటులోకి తీసుకొస్తూ, ద్విభాషా పాఠ్య పుస్తకాలను పరిచయం చేస్తూ.. తీసుకున్న చర్యలతో పాఠశాల విద్యలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది.

–సాక్షి, అనకాపల్లి

- నాణ్యమైన విద్య, సంస్కరణల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ
- శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ అమలుకు శ్రీకారం



విద్యా సంస్కరణల్లో భాగంగా సర్కారు బడుల్లో విద్యా బోధన మెరుగుపరిచి నాణ్యమైన విద్య అందించాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి ప్రజలు జేజేలు పలుకుతుంటే మరోవైపు పాఠశాలల విలీనంపై ఈనాడు పత్రిక పాఠకులను తప్పుదోవ పట్టిస్తున్నది. నూతన విద్యా విప్లవంలో భాగంగా పాఠశాలల విలీనంతో పాటు, ఉపాధ్యాయుల సర్దుబాటు, వసతుల ఏర్పాటు వంటి చర్యలపై వాస్తవ దూరమైన కథనం ప్రచురించింది. అయితే విద్యాధికారులు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఈ విమర్శలను కొట్టిపారేస్తున్నారు.

సాధారణ బదిలీలు..

జిల్లాలో 98 మంది విద్యార్థుల కన్నా తక్కువగా 75 యూపీ సూళ్లు ఉన్నాయి. వీటిలో 350 మంది వరకూ స్కూల్ అసిస్టెంట్‌లున్నారు. వీరిలో కొందరికి సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం అయింది. ఉదాహరణకు అనకాపల్లి మండలం సుందరయ్యపేట ఎంపీయూపీ స్కూళ్లలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ ఉంది. అక్కడ 77 మంది విద్యార్థులకు నలుగురు ఎస్‌జీటీ టీచర్లు, ఒక స్కూల్ అసిస్టెంట్ (తెలుగు పండిట్) టీచర్ బోధిస్తున్నారు. సాధారణ బదిలీల్లో తెలుగు పండిట్ టీచర్ ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం హైస్కూల్‌కి బదిలీపై వెళ్లారు.

నాలుగేళ్లలో ఎన్నో సంస్కరణలు

- నాలుగేళ్ల పాలనలో విద్యావ్యవస్థలో ఎన్నో రకాల సంస్కరణలు, సంక్షేమ పథకాలను ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. పాఠశాలల ప్రారంభం రోజునే జిల్లాలో జగనన్న విద్యా కానుక కిట్లు పేరిట విద్యార్థుల పుస్తకాలు, భోజనం, స్కూలు బ్యాగులు, షూ, యూనిఫారాలు ఇలా అన్నింటిలో నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అందించింది.
- వరల్డ్ క్లాస్ విద్యా బోధనలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందించి డిజిటల్ తరగతులకూ నాంది పలికింది. దీనికి కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన 'పెర్‌ఫారెమెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్'లో కూడా ఏపీ అగ్రభాగాన నిలిచింది.
- 2019లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేనాటికి విద్యారంగంలో లెవల్-6 లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ కృషితో ఏకంగా లెవల్-2కు చేరుకోవడం గమనార్హం.

ఇదీ ఈనాడు దుష్ప్రచారం...

సబ్జెక్టు టీచర్ల తొలగింపు

గడచిన విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలలకు సమీపంలో గల ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేశారు. వారికి కూడా ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థుల మాదిరిగా సబ్జెక్ట్ టీచర్లతో బోధన జరుగుతుందని, దీని వల్ల విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఏడాది వచ్చే సరికి 98 మంది కంటే తక్కువ పిల్లలు గల ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లను కేటాయించలేమని చెబుతూ ఆయా స్కూళ్లలో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లను తప్పించి హైస్కూళ్లకు సర్దుబాటు చేసింది. వారి స్థానంలో నలుగురు ఎస్‌జీటీలను నియమించి వారితోనే మూడు నుంచి ఎనిమిది తరగతులకు బోధన జరపాలని నిర్ణయించింది. సబ్జెక్టు టీచర్లకు, వీరికి బోధనలో తేడా ఉంటుందని, దీనివల్ల పిల్లల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతుంది.

ఇదీ వాస్తవం...

సర్దుబాటు మాత్రమే...

ఏపీ ప్రభుత్వం ఇప్పుడు నూతన విద్యా విధానం అమలుకు శ్రీకారం చుడుతుంది. అన్ని పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేయడంలో భాగంగా టీచర్ల సర్దుబాటు జరుగుతోంది. గత విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలల్లో 98 మంది కన్నా తక్కువగా విద్యార్థులున్న చోట స్కూల్ అసిస్టెంట్ టీచర్లను సర్దుబాటు చేస్తోంది. శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌లుగా నూతన విద్యావ్యవస్థను అమలు చేయడానికి మ్యాపింగ్ చేపడుతోంది. ఇప్పటికే జిల్లాలో 219 ప్రైమరీ, ప్రాథమికోన్నత పాఠశాలలను 132 హైస్కూల్స్‌కి మ్యాపింగ్ చేశారు. ఎంపీయూపీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీగా విభజించి..అక్కడ ఉన్న స్కూల్ అసిస్టెంట్లను సమీప హైస్కూళ్లకూ సర్దుబాటు చేస్తున్నారు. నూతన విద్యా విధానం ప్రకారం శాటిలైట్ స్కూళ్లగా ఎల్‌కేజీ, యూకేజీలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటుకూ...ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఫౌండేషన్ (ఒకటి నుంచి మూడో తరగతి వరకూ), ఫౌండేషన్ ప్లస్ (ఒకటి నుంచి ఎనిమిది వరకూ), ప్రీ హైస్కూల్(ఒకటి నుంచి ఎనిమిది వరకూ), హైస్కూల్ (ఐదు నుంచి పది వరకూ), హైస్కూల్ ప్లస్ (ఇంటర్) అమలుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 మంది టీచర్ల కంటే తక్కువగా ఉన్నటువంటి 150 యూపీ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లను సమీప హైస్కూల్‌కు సర్దుబాటు చేశారు. వీటిలో అనకాపల్లి జిల్లాలో 75 యూపీ స్కూళ్లలో టీచర్లను సర్దుబాటు చేశారు. అదేవిధంగా అల్లూరి జిల్లాలో 64 యూపీ స్కూళ్లలో చేశారు.

అనకాపల్లి జిల్లాలో పాఠశాల వివరాలు..

మొత్తం పాఠశాలలు	- 1,901
ప్రైమరీ స్కూల్స్	- 1,129
అప్పర్‌ప్రైమరీ	- 341
హైస్కూల్స్	- 431
విద్యార్థుల సంఖ్య	- 2,21,788
మొత్తం ఉపాధ్యాయులు	- 10,412

స్కూల్ అసిస్టెంట్‌లను సర్దుబాటు చేశారంతే..



మ్యాపింగ్‌లో భాగంగా ఎంపీయూపీ స్కూల్స్‌లో గతంలో ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ రెండూ కలిసి ఉన్నాయి. వీటిని ఒకటి నుంచి మూడు వరకూ ప్రైమరీగా 3 నుంచి 5 తరగతులను సమీపంలో గల హైస్కూళ్లలోకి మార్చడం జరిగింది. దీంతో ప్రైమరీ ఉన్న చోట ఎస్‌జీటీలు ఉంటారు. మూడో తరగతి ఆపై ఉన్న చోట స్కూల్ అసిస్టెంట్‌లను మార్పు చేయడం జరిగింది. దీనిని సమస్యగా చూపడం తగదు. – డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్

బోధనలో నాణ్యత తగ్గదు



ఎంపీయూపీ స్కూళ్లను సమీప హైస్కూళ్లకు మ్యాపింగ్ చేస్తున్నాం. టీచర్‌లనూ సమీప హైస్కూళ్ల లో సర్దుబాటు చేశాం. 98 మంది విద్యార్థుల కన్నా తక్కువగా జిల్లాలో 75 యూపీ సూళ్లు ఉన్నాయి. వాటి లో 350 మంది స్కూల్ అసిస్టెంట్‌లున్నారు. వీరిలో కొందరికి సాధారణ బదిలీలో స్థానచలనం అయింది. కొత్తగా 21 అప్‌గ్రేడ్ స్కూళ్లు కూడా ఉన్నాయి. 98 మంది కన్నా తక్కువ ఉన్న చోట విద్యార్థుల సంఖ్య పెరిగితే అక్కడ స్కూల్ అసిస్టెంట్‌ను కూడా వేయడం జరుగుతుంది.

– వెంకట లక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

సెల్ఫీ వార్

- వాటర్‌గ్రిడ్ పూర్తి చేయలేదని టీడీపీ నాయకుల విమర్శలు
- ఆధారాలతో గట్టిగా కౌంటర్ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు
- సెల్ఫీలతో పోటాపోటీగా వాగ్బాణాలు



వాటర్‌గ్రిడ్ వద్ద సెల్ఫీ దిగుతున్న టీడీపీ నాయకులు



వాటర్‌గ్రిడ్ వద్ద సెల్ఫీ దిగి వాస్తవాలు వెల్లడిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నక్కపల్లి: ఉద్దండపురం వద్ద నిర్మాణంలో ఉన్న వాటర్‌గ్రిడ్ చుట్టూ గురువారం సెల్ఫీ వార్ నడిచింది. పాయకరావుపేటలో టీడీపీ బస్సు యాత్ర ప్రారంభించిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఉద్దండపురం వద్ద వాటర్‌గ్రిడ్ నిర్మాణం ప్రారంభిస్తే పూర్తి చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని, ప్రజలకు కనీసం తాగునీరు కూడా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు. ఉద్దండపురం వాటర్‌గ్రిడ్ వద్ద వీరంతా సెల్ఫీ దిగారు. అయితే వాస్తవాలు కప్పిపుచ్చి అవాకులు చవాకులు మాట్లాడడంతో చివరకు వారు నవ్వులపాలు కావాల్సి వచ్చింది.

వాటర్‌గ్రిడ్‌కు శ్రీకారం చుట్టింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన హయాంలోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తాజాగా రూ.88 కోట్లు మంజూరు చేయడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు. ఈ వాస్తవాలను వెల్లడిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సెల్ఫీలతో ఎదురుదాడి చేశారు.

టీడీపీ నేతలు సెల్ఫీలు దిగడం సిగ్గుచేటు

పాయకరావుపేట నియోజకవర్గంలో 97 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే సదాశయంతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు వైఎస్సార్ 2009లో శ్రీకారం చుట్టారని, ఈ బృహత్తర పథకాన్ని హైజాక్ చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ టీడీపీని హెచ్చరించారు. మహానేత హయాంలోనే ఈ ప్రాజెక్టును రూ.31 కోట్లతో ప్రారంభించారని, ఆయన మరణానంతరం వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పట్టించుకోలేదని, 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అరకొరగా రూ.51 కోట్లు విడుదల చేసి, చేపట్టిన పనులతో 8 గ్రామాలకు మాత్రమే నీటిని సరఫరా చేయగలుగుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ తాజాగా రూ.88 కోట్లు విడుదల చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత టీడీపీ రాష్ట్ర నాయకులను ఉద్దండపురం తీసుకువచ్చి అసంపూర్తిగా ఉందని, ప్రభుత్వం పట్టించుకోలేదంటూ సెల్ఫీలు దిగడం సిగ్గుచేటన్నారు. వాటర్‌గ్రిడ్ వద్ద వీసం రామకృష్ణతోపాటు ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు సెల్ఫీలు దిగారు. వాటర్‌గ్రిడ్ ప్రారంభించింది వైఎస్సార్.. పూర్తి చేసేది ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు.

2009లోనే బీజం

ఉద్దండపురం వాటర్‌గ్రిడ్‌కు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే బీజం పడింది. అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కృషితో రూ.31 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఏలేరు కాలువ నుంచి ఉద్దండపురం వరకు ఏలేరు నీటిని తరలించే పైపులైను పనులు గొలుగొండ మండలం నుంచి కోటనందూరు వరకు 22 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. ఏలేరు కాలువ నీటిని పాయకరావుపేట నియోజకవర్గ తాగునీటి అవసరాలకు ఉపయోగించేందుకు అనుమతులు కూడా వైఎస్ హయాంలోనే వచ్చాయి. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం రూ.51 కోట్లు విడుదల చేయడంతో పైపులైను పూర్తి చేసి, వాటర్‌ట్యాంకులు నిర్మించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి 8 గ్రామాలకు తాగునీరు అందించారు. తాజాగా ఎమ్మెల్యే బాబూరావు కోరిక మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.88 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియలో ఉంది. పూర్తయితే పనులు ప్రారంభిస్తాం. –ఆనంద్, డివిజినల్ ఇంజినీర్

తుస్సుమన్న బస్సు యాత్ర

ఆశ లావు.. పీక సన్నం మాదిరిగా తయారయింది టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత బస్సు యాత్ర. ఉత్తరాంధ్ర సీనియర్ నేతలతో భారీ స్థాయిలో తమ భవిష్యత్తుకు గ్యారంటీ పొందేందుకు చేపట్టిన చైతన్య రథం వెంట నడిచేందుకు నలుగురు పేరెన్నికగన్న నేతల్లేక నీరసపడింది. నమ్ముకున్న నాయకులు హ్యాండివ్వడంతో ఉన్నవారితోనే మమ అనిపించాల్సి వచ్చింది.

- గైర్హాజరైన అచ్చెన్న, యనమల
- ముఖం చాటేసిన గంటా వర్గం
- ఆశించిన స్థాయిలో స్పందన లేక డీలా

నక్కపల్లి: భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథం పేరిట టీడీపీ నాయకులు చేపట్టిన ఉత్తరాంధ్ర బస్సు యాత్ర తుస్సుమంది. యాత్రకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర సీనియర్ నేత కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు గైర్హాజరయ్యారు. వీరితోపాటు మరో సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అతని వర్గం నేతలు ముఖం చాటేశారు. దీంతో బస్సు యాత్ర ప్రారంభమే అభాసుపాలైనట్టు పార్టీ కేడర్ గుసగుసలుపోతోంది. టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరగనున్న ఈ బస్సుయాత్రలో అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు పాల్గొంటారని విస్తృత ప్రచారం చేశారు. గంటా శ్రీనివాసరావు ప్రస్తావన మాత్రం ఎక్కడా తీసుకురాలేదు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ప్రారంభించి ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో యాత్ర కొనసాగించి, ప్రభుత్వ తీరును ఎండగడతామని బీరాలు పోయారు. ఉత్తరాంధ్రకు చెందిన పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలందరినీ ఆహ్వానించి తమ బలాన్ని ప్రదర్శించాలనుకుంటే వీరికి ఆదిలోనే హంసపాదు ఎదురైనట్టయింది. నాయకులు, కార్యకర్తలు ఆశించిన విధంగా ఈ యాత్రకు అచ్చెన్నాయుడు, పక్క జిల్లాకు చెందిన సీనియర్ నేత యనమల రాలేదు. జిల్లాలో సీనియర్ నేత అయ్యన్న, అనితల వ్యతిరేక వర్గానికి నాయకత్వం వహిస్తున్న మరో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన వర్గీయులు కూడా పత్తాలేదు.

పాయకరావుపేట నియోజకవర్గంలోని అనిత వ్యతిరేక వర్గం ముఖం చాటేసింది. నియోజకవర్గం తెలుగు తమ్ముళ్ల నుంచి కూడా ఆశించిన స్పందన రాలేదు. షెడ్యూల్ ప్రకారం బస్సులో కూర్చుని యాత్ర కొనసాగించాల్సిన నాయకులంతా సెల్ఫీలు దిగిన తర్వాత ఎవరి కారులో వారు తిరుగుముఖం పట్టారు. భోజనాల దగ్గర, కార్యక్రమం దగ్గర మాత్రమే కార్లు దిగి, ప్రభుత్వాన్ని విమర్శించేందుకే యాత్ర పరిమితం కావడం గమనార్హం.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

నర్సీపట్నం: గంజాయి తీసుకువెళ్తున్న విజయవాడకు చెందిన నలుగురు యువకులు, ఒక యువతిని టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టౌన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు... చింతపల్లి రూట్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా నలుగురు యువకులు, యువతి అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద బ్యాగ్‌లను తనిఖీ చేశారు. వారి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన సల్మాన్(19), జి.రాజు, మణికంఠ, బి.దుర్గాప్రసాద్‌తోపాటు సాయికుమారి అనే యువతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతపల్లి పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి విజయవాడ తీసుకు వెళ్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

ముగ్గురి అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట బస్‌స్టేషన్ నుంచి నాలుగు కేజీల గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర అరెస్టు చేశారు. గంటూరు జిల్లాకు చెందిన కుంచం చినరాజప్ప (18), గూడి పవన్‌కుమార్ (20), వీరాంజనేయులు (35) అనే ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌తో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు తరలించామని చెప్పారు.

ఉరేసుకుని కలాసీ ఆత్మహత్య

నర్సీపట్నం: పట్టణంలో జిల్లా పరిషత్ హైస్కూల్ (తురకబడి) వెనుక ఖాళీ స్థలంలో చెట్టుకు ఉరేసుకుని జి.మల్లేశ్వరరావు(40) ఆత్మహత్య చేసుకున్నాడని టౌన్ ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కొత్తవీధికి చెందిన ఆయన కలాసీ పని చేస్తుంటాడు. కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ దారుణానికి ఒడిగట్టాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడు అనుమానాస్పద మృతి

మాడుగుల రూరల్: మండలంలో సత్యవరం గ్రామానికి చెందిన వాలేటి వెంకటరావు(28) అనుమానాస్పదంగా మృతి చెందాడు. వీరవల్లి అగ్రహారం సమీపంలో ఇటుకల బట్టీ వద్ద గురువారం ఉదయం ఉరేసుకుని మృతి చెందిన విషయం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. దీనిపై మృతుడు సోదరుడు మోహన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎం.బి.ఎ చదువుకున్న వెంకటరావు కొద్ది మాసాలుగా చింతపల్లి మండలం లంబసింగి సమీపంలో చిత్రాలగుట్టలో ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి వీరవల్లి అగ్రహారం మోదమాంబ ఆలయం సమీపంలో ఇటుకల బట్టీ ప్రాంతంలో ఉరేసుకుని చనిపోయాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- పండగలా ఆరిల్లోవ రోడ్డు పనులు ప్రారంభం
- బ్రిటిష్ కాలం నాటి రోడ్డు సమస్యకు మోక్షం



రోడ్డు పనులు ప్రారంభం చేస్తున్న నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు

గొలుగొండ: ఒకటా.. రెండా.. వందేళ్ల నాటి గొలుగొండ మండల ప్రధాన రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. ఏ ప్రభుత్వమూ, ఏ నాయకులకు సాధ్యంకానిది నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేసి చూపిస్తున్నారు. ఈ మేరకు అరిల్లోవ రోడ్డు పనులు గురువారం పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం– కృష్ణదేవిపేట ప్రధాన మార్గంలో రూ.6 కోట్లతో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గణేష్, ఆర్డీవో జయరాం, నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ మోహన్ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. దాంతో జై జగన్ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆరిల్లోవ అటవీ ప్రాంతం మారుమోగిపోయింది.

మిఠాయిలు పంచిన ఎమ్మెల్యే ...

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైన వెంటనే మండలంలో వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో కిలోమీటరు మేర ర్యాలీ నిర్వహించారు. దారంట కనిపించిన ప్రతీ ప్రయాణికుడికి మిఠాయిలు పంచారు. బస్సుల్లో ప్రయాణం చేసి వారికి సైతం ఎమ్మెల్యే స్వయంగా మిఠాయిలు పంచిపెట్టారు. వాహనదారులు సైతం ఎంతో సంబర పడ్డారు. ఎమ్మెల్యేకు థ్యాంక్యూ చెప్పారు.

అయ్యన్న.. చూడు రోడ్డు వేస్తున్నాం...

నర్సీపట్నం నియోజకవర్గంలో 40 సంవత్సరాల నుంచి రాజకీయాలు చేసి గొలుగొండ ప్రజలను పూర్తిగా మోసం చేసిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిపై ఎమ్మెల్యే గణేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'రోడ్డు వేసే సత్తా వైఎస్సార్‌సీపీకి, నాకు లేదని నువ్వు, నీ చెంచాగాళ్లు ప్రచారాలు చేశారు కదా... ప్రస్తుతం ఆరిల్లోవలో రోడ్డు వేస్తున్నాం చూడు అంటూ.. సవాల్ విసి రారు. మా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం పని చేస్తున్నారు కాబట్టే ఈ పనులు చేస్తున్నాం.. గొలుగొండ ప్రజలు నీకు మరలా బుద్ధి చెప్పడం ఖాయం అని' విమర్శించారు. 2019 ఎన్నికల హామీ మేరకు ఈ రోడ్డు విస్తరణకు మూడేళ్లపాటు అవిరళ కృషి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి అటవీశాఖ అడ్డంకులు తొలగాయి. కార్యక్రమంలో నర్సీపట్నం వ్యవసాయ శాఖ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీప గజ్జలపు మణికుమారి, ఎస్సీ సెల్ విభాగం లోచల సుజాత, వైస్ ఎంపీపీలు బాబ్జి, నాగమణి, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండలంలో 21 సర్పంచ్‌లు, 14 ఎంపీటీసీలు, పార్టీ శ్రేణుల, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

24న యువ ఉత్సవ్ ఇండియా ఏ 2047 పోటీలు



గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 24న గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో ×యువ ఉత్సవ్ ఇండియా ఏ2047₹ నిర్వహిస్తున్నట్లు ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. గురువారం తన కార్యాలయంలో యువ ఉత్సవ్ ఇండియా ఏ2047 గోడపత్రికలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువశక్తి పెంపుదలలో భాగంగా యువ ఉత్సవ్–2023 పేరున జిల్లా స్థాయిలో వక్తృత్వ, యువ కళాకారులు, యువ రచయితలు, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయక వారసత్వ ప్రదర్శనల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి చెందిన భారత దేశ లక్ష్యం, బానిసత్వం వలసవాద మనస్తత్వాలను తొలగించడం, వారసత్వం, ఐక్యత, సంఘీభావం, పౌరులలో కర్తవ్య భావం, (పంచ ప్రాణాలు ఐదు సంకల్పాలు) ప్రధాన అంశాలుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యువ ఉత్సవ్ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ఆగస్టు నుంచి సెప్టెంబర్ 2023 వరకు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు అక్టోబర్ 3, 4 తేదీల్లో ఢిల్లీలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 8074605109 సంప్రదించాలని కోరా రు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

జీలుగులోవలో విషజ్వరాలు

రెండు కొండలెక్కి వైద్య సిబ్బంది సేవలు



కర్రల సాయంతో ఎత్తయిన కొండలెక్కుతున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతమైన శివారు కొండపై గిరిజన గ్రామం జీలుగులోవలో పలువురికి విషజ్వరాలు ప్రబలాయి. కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పలువురు గిరిజనులకు విష జ్వరాలు ప్రబలాయని, కొండ దిగి వచ్చే ఓపిక లేదని స్థానికులు సమాచారం అందించడంతో ఎంపీహెచ్‌వో మల్లిబాబు ఆధ్వర్యంలో టెక్నికల్, ప్రధాన సిబ్బంది నాయుడు, జోషిని, ఉషారాణి, స్థానిక ఏఎన్‌ఎం ఎత్తయిన రెండు కొండ లెక్కి ఆ గ్రామం చేరుకున్నారు. ఎంతో ప్రయాస పడి వచ్చిన ఆరోగ్య సిబ్బందికి తమ సమస్యను చెప్పుకున్నారు. అనంతరం జ్వరబాధితులు కొర్ర గౌరి, జ్యోతి, గాసెన్న, అనీష్ తదితరులకు రక్తపరీక్షలు చేశారు. సీజనల్ జ్వరాలుగా గుర్తించారు. మందులు అందించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మొదటి విడతగా అందించిన దోమ తెరలు చిరిగిపోయాయని గిరిజనులు చెప్పడంతో త్వరలోనే పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ కుమార్



వైద్య సేవలపై రోగులను ఆరా తీస్తున్న డీసీహెచ్

నక్కపల్లి: ఆస్పత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సకాలంలో వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇన్‌పేషంట్లుగా చేరిన వారికి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలన్నారు. ఓపీ రోగుల సంఖ్యకు ఇక్కడ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచి పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించామన్నారు. ఫార్మసీ, ఎక్స్‌రే, స్టోర్ రూములను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. విధులకు సక్రమంగా హాజరు కావాలని సిబ్బందిని ఆదేశించారు. మందుల కొరత లేదన్నారు. ఇక్కడ అత్యవసర సేవలు సక్రమంగా అందడం లేదని, ప్రతి చిన్న కేసును అనకాపల్లి, విశాఖ రిఫర్ చేస్తున్నారని ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ డీసీహెచ్‌కు ఫిర్యాదు చేశారు. సర్జరీలు చేయడం లేదన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

రౌడీషీటర్ హత్య

- భూతగాదాయే కారణమంటున్న పోలీసులు
- అనకాపల్లి జిల్లాలో ఘటన

అనకాపల్లి టౌన్: భూ తగాదా విషయంలో ఇద్దరు రౌడీషీటర్ల మధ్య జరిగిన ఘర్షణ ఓ రౌడీషీటర్ ప్రాణాలు తీసింది. అనకాపల్లి మండలం ఊడేరు రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో గురువారం తెల్లవారుజామున మృతదేహం లభ్యమైంది. మృతుడు రౌడీషీటర్ కన్నబాబుగా పోలీసులు గుర్తించారు. అయనపై గతంలో విశాఖ నగరంలో ఒక కిడ్నాప్ కేసు, ఒక హత్య కేసు, భూ సెటిల్‌మెంట్ వివాదంలో పలు కేసులున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో విశాఖ పోలీసులు పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చి నగరాన్ని వదిలి వెళ్లిపోవాలని ఫైనల్ వార్నింగ్ ఇచ్చారు. లేదంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని గతంలో విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు. దీంతో 2021లో విశాఖ నగరాన్ని వదిలి అనకాపల్లికి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. అనకాపల్లి టౌన్ గాంధీనగరంలో రౌడీషీటర్ కన్నబాబు, తమ్ముడు శివరామకృష్ణ లిద్దరూ తమ తల్లితో జీవిస్తున్నారు. రౌడీషీటర్ కన్నబాబును బుధవారం ఉదయం 10 గంటలకు తన స్నేహితుడైన మరో రౌడీషీటర్ బైక్‌పై తీసుకుని వెళ్లాడు. ఉదయం వెళ్లిన కన్నబాబు రాత్రి 8.30 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆయన తమ్ముడు కన్నబాబు సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అయితే గురువారం అనకాపల్లి మండలం ఊడేరు గ్రామ సమీపంలో ఓ లేఅవుట్ వద్ద అన్న హత్యకు గురైనట్లు తెలుసుకున్న శివరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడితో సన్నిహితంగా ఉన్న మరో రౌడీషీటర్ సురేంద్రతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇటీవల ఒక ల్యాండ్ సెటిల్‌మెంట్ జరగ్గా.. పంపకాల్లో తేడా వచ్చినందుకే హత్యచేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

- రోగుల ఆరోగ్య చరిత్రను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే
- మాకవరపాలెం, కశింకోట మండలాల్లో కలెక్టర్ పర్యటన



తాళ్లపాలెం పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మాకవరపాలెం/కశింకోట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మాకవరపాలెం, కశింకోట మండలాల్లో ఆయన గురువారం సుడిగాలి పర్యటన జరిపారు. మాకవరపాలెంలోని బూరుగుపాలెంలో సుమారు మూడు గంటలపాటు పర్యటించారు. ముందుగా పీహెచ్‌సీని పరిశీలించిన కలెక్టర్ గంటకుపైగా సిబ్బందితో సమీక్షించారు. నిత్యం రోగులకు అందుతున్న సేవలు, వైద్య పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను సందర్శించి రోజూ ఏయే కేసులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నదీ రికార్డులు తనిఖీ చేశారు. రోగుల వివరాల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి నాడు–నేడు పనుల ప్రగతిని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. సచివాలయంలో మండలస్థాయి అధికారులు, సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. జగనన్న కాలనీని పరిశీలించి నిర్మాణాలు వేగవంతం కావాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

కశింకోట మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల ఆరోగ్య చరిత్రను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ, రికార్డులను, ప్రసవ గది, మందుల గది, ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల వివరాలు ఎలక్ట్రానిక్ రికార్డుల్లో నమోదు చేయడం ద్వారా, వారి ఆరోగ్య చరిత్రను ఎప్పటికప్పుడు తక్షణమే తెలుసుకుని వైద్య సేవలందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మధుమేహం, బీపీ తదితర దీర్ఘకాలిక రోగులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాలు తక్కువగా ఉన్నాయని, వాటిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో ఆయన వెంట డీఎంహెచ్‌వో హేమంత్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, వైద్యాధికారి యు.రమేష్, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ రమణ, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్లు ప్రసాదరావు, జి.సత్యనారాయణ, హెచ్‌డీటీ నరేష్‌నాయుడు, ఎంఈవోలు నరేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు' విజయోత్సవ సభ

ముఖ్య అతిథిగా రానున్న వైవీ సుబ్బారెడ్డి



పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన షామియానాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో శుక్రవారం విజయోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. ఇక్కడ ఏర్పాట్లతో పోలీస్ గ్రౌండ్ సందడిగా మారింది. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఈ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో నిర్వహించే ఈ సభకు వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర పరిశీలకుడు, టీడీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబు రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి, విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేశ్, అదీప్‌రాజు, గొల్ల బాబూరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిళ్లా రమాకుమారి హాజరు కానున్నారన్నారు. అంతేగాకుండా పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, గౌతమ బుద్ధుడు ,మహాత్మా గాంధీ విగ్రహాలను ముఖ్య అతిథి ఆవిష్కరిస్తారన్నారు. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ మేరకు ఏరాట్లను డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, సర్పంచ్ విమలనాయుడు, దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, శోభన్‌బాబు, పిన్న మరాజు వాసు పాల్గొన్నారు.

మీరు చేయనివి.. మేం చేసి చూపించాం

టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ నేతల సెల్ఫీ ఛాలెంజ్




నక్కపల్లి ఆస్పత్రి వద్ద సెల్ఫీ దిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: టీడీపీ నాయకులకు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు నక్కపల్లి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. 14 ఏళ్ల అధికారంలో ఉండీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని వారికి, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామంటూ చేసిన అభివృద్ధి పనుల ముందు సెల్ఫీలు దిగారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల వద్ద సెల్ఫీలు దిగారు. 2014 ఎన్నికల ముందు నక్కపల్లి ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతానని, నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయిస్తానని, పేట మెయిన్ రోడ్డును విస్తరిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వంగలపూడి అనిత గుప్పించిన హామీలను గుర్తు చేశారు. ఆమె మాటలు నమ్మి 2014లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ఐదేళ్ల కాలంలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. 2019లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇచ్చిన హామీల మేరకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు పెంచి, రూ.3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారని తెలిపారు. పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించి రెండేళ్ల క్రితమే తరగతులు కూడా ప్రారంభించామన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణకు వైఎస్సార్ హయాంలోనే రూ.3 కోట్లు మంజూరు చేయిస్తే, తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం రూ.4 కోట్లకు పెంచి నిర్మాణ బాధ్యతలను ఆర్ అండ్ బీ నుంచి వుడాకు అప్పగించారని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం అంచనాలను రూ.6 కోట్లకు పెంచిందని, రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు సాగిస్తున్న చిల్లర వర్తకులు కోర్టును ఆశ్రయించడం వల్లే రోడ్డు విస్తరణ నిలిచిపోయిందన్నారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పుష్కరిణిని రూ.70 లక్షలతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సెల్ఫీలు దిగడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగ ఈశ్వర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, సర్పంచ్‌లు భార్గవ్, వెంకటేష్, ఎంపీటీసీలు తిరుపతిరావు, గొర్ల గోవిందు, సూరిబాబు, లక్ష్మణ్, చిన్ని, శంకర్రావు, రోకళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రలో అపశృతి

ర్యాలీలో బైక్ బోల్తాపడి కార్యకర్తకి గాయాలు

నక్కపల్లి: టీడీపీ నాయకులు గురువారం చేపట్టిన బస్సు యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. నాయకులు కార్యకర్తలు కలిసి పాయకరావుపేట నుంచి ఉద్దండపురం వరకు జాతీయ రహదారిపై బైక్ ర్యాలీగా వెళ్తుండగా గొడిచెర్ల దాటాక రెండు బైక్‌లు ఒకదానికొకటి దగ్గరగా రావడంతో బైక్ బోల్తాపడింది. ఈ ఘటనలో దేవవరం గ్రామానికి చెందిన బత్తుల రమణబాబు కాలికి తీవ్రగాయమైంది. వెంటనే క్షతగాత్రుడ్ని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో కాలు విరిగినట్లు తెలిసింది.



ప్రమాదంలో గాయపడ్డ రమణబాబు

బాలికపై లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు

విశాఖ లీగల్/రావికమతం: ముక్కుపచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికియత్నించిన వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ. 20 వేల జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని పోక్సో కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి. ఆనందిని గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. స్థానికంగా సంచలనం కలిగించిన ఈ కేసు వివరాలను రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు గురువారం తెలియజేశారు. వివరాలివి. నిందితుడు కాసిం శెట్టి చిరంజీవి (26)ది అనకాపల్లి జిల్లా రావికమతం గర్నిక గ్రామం. వృత్తి రీత్యా వ్యవసాయదారుడు. బాధిత బాలిక 2018 జూలై 15న స్నేహితులతో కలిసి సమీపంలోని పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంటకు తిరిగి వచ్చింది. ఈ సమయంలో నిందితుడు బాలికను సమీపంలోని చెరకు తోటలోకి తీసుకువెళ్లి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు, కుటుంబీకులు వచ్చి బాలికను రక్షించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రావికమతం పోలీసులు నిందితుడిపై సెక్షన్ 354, 354ఎ,354బి కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి వయసు 13 ఏళ్లు కావడంతో పోక్సో చట్టం సెక్షన్ ఏడు కింద కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టుకు సమర్పించారు. స్పెషల్ పీపీ కరణం కృష్ణ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.


వరికి ముందు నవధాన్యాలు లాభదాయకం



రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న దృశ్యం

రావికమతం: వరి సాగుకు ముందు భూమిలో నవధాన్యాలు వేయడం వల్ల ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా అందుతాయని, తెగుళ్లు లేని ఆరోగ్య దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ అధికారి ప్రకాష్ తెలిపారు. దొండపూడి ఆర్బీకేలో పలువురు రైతులకు 30 రకాల అపరాల విత్తన కిట్లను ఆయన గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై వీటిని అందిస్తుందన్నారు. ప్రతి రైతు వరికి ముందు సాగు చేస్తే, ప్రధాన పంటలో లాభాలేగాక వీటి ఫలాలు పొందవచ్చన్నారు. పశువులకు మేతగానూ ఉపయోగించుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగుల మందుల బాధలు ఉండవన్నారు. అనంతరం గ్రామంలో ఇప్పటికే రైతులు సాగు చేసిన భూములను పరిశీలించి అభినందించారు. ఉప సర్పంచ్ గ(ం)ట్రెడ్డి రాజారావు, మాజీ సర్పంచ్ తాత బాబు, సిబ్బంది రామలక్ష్మి, జగదీష్, గుణవతి, నిర్మల పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలు



కరాటే పోటీల గోడపత్రికలను విడుదల చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఏసీ కల్యాణ మండపంలో జూలై 14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు డి.వి.ఆర్ కార్యాలయంలో పోటీల కరపత్రాలను గురువారం ఆయన విడుదల చేశారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ పోటీలను నిజిసోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.కోరికుమార్, ప్రతినిధి ఎస్.వి.ఎం.డి.నాయుడు, చీఫ్ ఆర్గనైజర్ టి.ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జ్ కొణతాల భాస్కర్, నేతలు శిలపరశెట్టి బాబి, ఆళ్ల ప్రవీణ్, మళ్ల రామచంద్రరావు, యల్లపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మారేడుపూడిలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని మారేడుపూడి గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో విద్యుత్ వైర్ల క్రింద జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఈపీడీసీఎల్ డివిజన్ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో అంజయ్యకాలనీ, గాంధీనగరం, న్యూబర్మా కాలనీ, ఉడ్‌పేట, చాకలిపేట, వేల్పులవీధి, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, నర్సింగరావుపేట, నెయ్యిలవీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



బోరును మరమ్మతు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ రహదారిలో వారం రోజులుగా పాడైపోయిన తాగునీటి బోరును గురువారం జీవీఎంసీ నీటిపారుదల విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 7వ వార్డు సచివాలయం కన్వీనర్ ఉగ్గిన అప్పారావు మాట్లాడుతూ స్థానిక ప్రజలు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి దృష్టికి బుధవారం రాత్రి సమస్యను తీసుకెళ్లినట్టు తెలిపారు. దీంతో ఆమె సమస్యను జీవీఎంసీ నీటిసరఫరా విభాగం ఉన్నతాధికారులకు నివేదించి, మరమ్మతులకు కృషి చేసినట్టు పేర్కొన్నారు. మరమ్మతులను జీవీఎంసీ నీటిపారుదలశాఖ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లి చిన్న, పెదిరెడ్ల బుచ్చిరాజు, వలంటీర్ ఉష పర్యవేక్షించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 44 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,000	4,070
మూడోరకం	3,860	3,860

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఓ నెగిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 306 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఆధునిక వైద్యం.. అందరికీ లభ్యం

ఉత్తమ విద్య, ఆధునిక వైద్యం.. ఈ రెండూ ఉచితంగా దొరికితే కుటుంబ సగటు వ్యయం సగానికి తగ్గిపోతుంది. పేద, మధ్య తరగతి కుటుంబ ఆదాయంలో సగానికంటే ఎక్కువ ఈ రెండింటికే వెళ్లిపోతోంది. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టిసారించింది. దేశ బడ్జెట్లో ఆరోగ్యంపై కేటాయింపులు 4 శాతానికి అటూఇటుగా ఉంటే.. మన రాష్ట్రంలో మాత్రం 7.3 శాతంగా ఉంది. నాడు–నేడులో ఆస్పత్రుల అభివృద్ధి, నిర్మాణం, ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ధీమా అందిస్తోంది.



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి హారిక సాహు

- జోన్ పరిధిలో మూడు ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు
- రూ.3.30 కోట్లతో నూతన భవనాలు, ఆధునిక వసతులు
- 72 రకాల రక్త పరీక్షలు, 172 రకాల మందులు ఉచితం



అధునాతన హంగులతో అతి సుందరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అనకాపల్లిటౌన్ : పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులు. వెళ్తే డాక్టర్లుండరు. ఒక వేళ డాక్టర్లున్నా.. మందులు, వైద్య పరీక్షలకు బయటకు వెళ్లాల్సిందే. ఇదంతా గతం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వైద్య, ఆరోగ్యంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. నాడు–నేడు పథకంలో ఆస్పత్రుల్ని అతి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లను భారీగా నిర్మించారు. ఆధునిక వసతులతోపాటు, అవసరమైన వైద్య సిబ్బందిని కూడా నియమించారు. అనకాపల్లి జోన్ పరిధిలో రూ.3.30 కోట్లతో మూడు పీహెచ్‌సీలకు కొత్తగా భవనాలు నిర్మించారు. దీంతో జోన్ పరిధిలోని ప్రజలు చికిత్స కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన అగత్యం తప్పింది.

ఒక్కో పీహెచ్‌సీకి రూ.కోటీ 10 లక్షలు

అనకాపల్లి జోన్ పరిధిలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న మూడు పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు. ఒక్కోదానికి రూ.కోటీ 10 లక్షలు చొప్పున మొత్తం రూ.3.30 కోట్లు వెచ్చించారు. 80, 81వ వార్డుల పరిధి అరుంధతినగర్(పల్లపువీధి)లో ఏపీ హెల్త్ స్ట్రెంగ్తనింగ్ అండ్ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంతో రూ.కోటీ 10 లక్షల నిధులతో వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించారు. 84వ వార్డు పరిధి గొల్లవీధి(కోట్నీవీధి), జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్‌ఆర్ పేట(సిరసపల్లి)లో చెరో రూ.కోటీ 10 లక్షల నిధులతో పీహెచ్‌సీలను నిర్మించారు. పట్టణంలో జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయం ఉన్నప్పటికీ, ఈ మూడు ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులు అట్టడుగు స్థాయిలో ఉన్నాయన్న నివేదికలతో ఆరోగ్య కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. దీంతో ఈ సమీప ప్రాంత ప్రజలకు ఇవే ప్రధాన ఆస్పత్రులుగా మారాయి.

సాయంత్రం వరకు వైద్య సేవలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. సగటున రోజుకు 520 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. 72 రకాలైన రక్త పరీక్షలు ఇక్కడి ల్యాబ్‌లోనే చేస్తున్నారు. రోగులకు వైద్య పరీక్షలు పూర్తి చేసి, రక్త పరీక్షల నివేదికలు వచ్చాక అవసరమైన మందుల్ని దాదాపు ఆస్పత్రిలోని మందుల విభాగం నుంచే ఉచితంగా ఇస్తున్నారు. ప్రస్తుతం 172 రకాల మందుల్ని అందుబాటులో ఉంచారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు, క్షయ, కుష్టు రోగులకు నెలవారీ అవసరమైన మందుల్ని కూడా అందిస్తున్నారు. గర్భిణులు, చిన్న పిల్లలకు సంబంధించిన వైద్యం, పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు, ఈఎన్టీ తదితర చికిత్సలన్నీ ఇక్కడే. దీంతో తీవ్రమైన, దీర్ఘకాలిక రోగాలకు మినహా స్థానికులు తమ ప్రాంతాన్ని దాటాల్సిన అగత్యం తప్పింది.



వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్న రోగులు



మందుల గది



కోట్నీవీధి పీహెచ్‌సీలో రక్త పరీక్షలకు బ్లడ్ శాంపిల్ తీస్తున్న సిబ్బంది

వైద్యంపై ధీమా

మా ఇంటికి సమీపంలోనే ఆరోగ్య కేంద్రం ఏర్పాటయింది. ఏ చిన్న సమస్య వచ్చినా పీహెచ్‌సీ డాక్టర్ దగ్గరికి వెళ్తున్నాం. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం ఉందని తెలిస్తే చాలు.. వెంటనే వలంటీర్, ఏఎన్‌ఎంలు ఇంటికే వస్తున్నారు. తమతోపాటు ఆస్పత్రికి రోగిని తీసుకెళ్తున్నారు. చికిత్స అనంతరం, అవసరమైన మందులు కూడా ఉచితంగానే ఇస్తున్నారు. గతంలో కంటే వైద్యం పరంగా ధీమా పెరిగింది.

– సత్యవతి, అనకాపల్లి

కుక్కకాటుకు చికిత్స

రాత్రి పగలు తేడా లేకుండా కుక్కలు రోడ్లపై తిరుగాడుతున్నాయి. వాహనాలకు అడ్డంగా రావడంతోపాటు కరుస్తున్నాయి. గూడ్స్‌రోడ్డు నుంచి కోట్నీవీధిలోని మా ఇంటికి వెళ్తున్నపుడు కుక్క నన్ను కరిచింది. పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా.. కోట్నీవీధి పీహెచ్‌సీకే వెళ్లా. అక్కడి డాక్టర్ 10 నిమిషాల్లో ఇంజక్షన్ ఇచ్చారు. వైద్యులు చెప్పిన రోజుల్లో వెళ్లి ఇంజక్షన్లు వేయించుకున్నా. ఇపుడు ఎలాంటి సమస్యల్లేవు.

– గణేష్, కోట్నీవీధి

ఆలస్యం చేయొద్దు

రోగులు వ్యాధి ప్రారంభంలోనే ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకుంటే త్వరితగతిన కోలుకోవచ్చు. చాలా మంది అశ్రద్ధ చేస్తుంటారు. దీంతో రోగం ముదిరి పోతుంది. అప్పుడు గానీ వైద్యుల్ని ఆశ్రయించరు. ఎక్కువగా అలాంటి రోగులకే వైద్యం అందిస్తున్నాం. ఆలస్యం కావడంతో కొన్ని రకాలైన వ్యాధులకు చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. వయసును బట్టి తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలి.

– జి.హారిక సాహు, వైద్యాధికారి, పల్లపువీధి

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీపై వెళ్తున్న వైద్యురాలు అనురాధను సత్కరిస్తున్న పరి, ఆస్పత్రి ఉద్యోగులు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఉద్యోగులు సేవా దృక్పథంతో విధులు నిర్వహించినట్లయితే సమాజంలో గుర్తింపు ఉంటుందని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం గైనకాలజీ విభాగంలో ఏడేళ్లపాటు రోగులకు సేవలందించి శ్రీకాకుళం ఆస్పత్రికి బదిలీపై వెళ్తున్న డాక్టర్ కె.అనురాధను వేదిక సభ్యులు, వైద్యాలయం ఉద్యోగులు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో గర్భిణులకు, రోగులకు మెరుగైన వైద్యసేవలందించి వారి మన్ననలు పొందినట్లు తెలిపారు. ఆమె కృషితో వారం క్రితం కేంద్ర ప్రభుత్వం గైనకాలజీ విభాగానికి ఉత్తమసేవ సర్టిఫికెట్ అందినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోగులు సత్యం చాణక్య, నూకరత్నం, ముత్యాలమ్మ, మహేశ్వరి, వరప్రసాద్, వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం, పచ్చిమిర్చి

కశింకోట : గత కొన్ని వారాలుగా భారీ ఉష్ణోగ్రతలతో అరకొరగా సాగిన వారపు సంత, వాతావరణం చల్లబడటంతో గురువారం సజావుగా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో కొనుగోలుకు రావడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్లం, పచ్చిమిర్చి మినహా కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. గత వారం రూ.70గా ఉన్న పచ్చిమిర్చి అమాంతంగా రూ.50 పెరిగి రూ.120కి, రూ.200గా ఉన్న అల్లం రూ.250కి పెరిగింది. టమాటా మెట్టు దిగలేదు. గత వారం మాదిరిగానే కిలో రూ.50కి విక్రయించారు. ఉల్లిపాయ ఎప్పటిలాగే రూ.20, బంగాళదుంప, క్యాబేజీ రూ.30, దొండకాయ, వంకాయ, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ రూ.40, కాకరకాయ, చేమ దుంపలు రూ.60, గోరు చిక్కుడు, క్యాప్సికం రూ.80కి విక్రయాలు జరిగాయి.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- విత్తనాల పంపిణీలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌కుమార్



రైతులకు విత్తనాలు అందిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. గురువారం తుమ్మపాల మేజర్ పంచాయతీ సచివాలయం–2లో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 830 మంది రైతులకు వరి, జనుము, పిల్లి పెసర, జీలుగు విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. రైతు భరోసా, ఆర్బీకేల ఏర్పాటు, యంత్ర సేవా పథకం ఇలా వ్యవసాయానికి అండగా ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఉపసర్పంచ్ చదరం చిన్నా, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, చంటి, వద్దాది భారతి, అశోక్, వార్డు సభ్యులు తర సత్యారావు, రామారావు, కొణతాల చంటమ్మ, అర్జున్, వెలగా మోదినాయుడు, పీలా బుజ్జి, పీలా విశ్వేశ్వరరావు, కన్వీనర్లు షరీఫ్, బుద్దా లహరి, ఆర్టీసీ సత్యనారాయణ, పెంటకోట జగన్, హైస్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి



డ్రగ్స్ రహిత సమాజానికి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

తుమ్మపాల : డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రంలో మత్తుపదార్థాల నివారణ, రవాణాను అడ్డుకోవాలని పట్టణ సీఐ దాడి మోహనరావు పిలుపునిచ్చారు. పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఆధ్వర్యంలో గురువారం శ్రీ చైతన్య, సంయుక్త కళాశాలల విద్యార్థులతో డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, రవాణాతో యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎలాంటి సమాచారం తెలిసినా.. 14500 నంబర్‌కు ఫోన్ చేసి, తెలపాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సెబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది

సబ్బవరం : ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ఇప్పటికే అనేక సేవలను ప్రజల ముంగిటకే అందిస్తుండగా.. అదనంగా రిజిస్ట్రేషన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చిందని తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం శివారు విప్పాక అగ్రహారంలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన సమగ్ర రీసర్వే పూర్తి కావడంతో గొల్లలపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి కొనుగోలుదారులకు తహసీల్దార్ పత్రాలు అందజేశారు.

సచివాలయం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మీనాయుడు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ హరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



దమయంతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : మండలంలోని సుందరయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థిని కె.దమయంతిని సర్పంచ్, వైస్ సర్పంచ్‌లు బాధపు ధనలక్ష్మి, బి.హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం ఆర్.గౌరినాయుడు అభినందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఎం.పైడిరాజు, ఉపాధ్యాయుడు గణపతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటుకు వినతి

తుమ్మపాల : పట్టణంలోని గాంధీనగరం జంక్షన్‌లో బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ బీవీ సత్యవతికి ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరావు గురువారం వినతిపత్రం అందించారు. చోడవరం, మాడుగుల, పాడేరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన సందర్భాల్లో గాంధీనగరం పరిసర ప్రాంతాల ప్రజలు బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆమెకు తెలిపారు. బస్‌స్టాప్ లేకపోవడంతో కిలో మీటరు వెనక్కి నడిచి రావాల్సి వస్తోందన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గాంధీనగరం 1వ సచివాలయం దగ్గర బస్‌స్టాప్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

టైలర్‌కు ఆర్థిక సాయం



గౌరీస్‌కు నగదు అందిస్తున్న యూనియన్ సభ్యులు

తుమ్మపాల : పట్టణంలో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న సీనియర్ టైలర్ కొరుప్రోలు గౌరీస్‌కు వైద్య ఖర్చులకు పట్టణ టైలర్స్ యూనియన్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేసింది. పట్టణంలో కర్రి వారి వీధిలో నివాసముంటున్న గౌరీస్ ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితులను గమనించిన యూనియన్ సభ్యులు చందాలు వేసుకుని ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకుడు బొజ్జి అప్పారావు, ప్రతినిధులు డీవీఎస్ నారాయణరావు, కానూరు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని వినతి

తుమ్మపాల : ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారులకు బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు వినతి పత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే పిల్లల భవిష్యత్ బాగుంటుందనే నమ్మకాన్ని అవకాశంగా చేసుకుని ఫీజుల రూపంలో భారీగా దోచుకుంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం తదితర సామగ్రి అమ్మకాలను స్కూల్లోనే నిర్వహిస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరాహావతారంలో జగన్నాథుడు



కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు వరాహావతారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశావతారాల్లో మూడోదైన వరాహావతారంలో జగన్నాథస్వామిని అలంకరించి సహస్ర నామ, ప్రత్యేక పూజలతో అర్చించారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



స్వామివారి సన్నిధిలో అర్చకుల ఆశీస్సులు అందుకుంటున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని గురువారం ఆయన దర్శించుకుని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నిద్రలేచిన నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి ఒక్కరూ అనేక సమస్యలతో సతమతమవుతూనే ఉంటారని, రోజులో కొంత సమయాన్ని దైవారాధనకు కేటాయించడం ద్వారా సమస్యలను జయించవచ్చన్నారు. అంతకు ముందు కమిటీ సభ్యులతోపాటు అర్చక బృందం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు పెంటకోట కోదండపాణి, కొణతాల పరదేశినాయుడు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, పలకా కాసులు, కోటిపల్లి శ్రీను, కర్రి వెంకటరావు, మళ్ల రామచంద్రరావు, ఎ.శ్రీనురవి, రేబాక ఇంద్రకుమార్, మారిశెట్టి శ్రీను, పాలమరిశెట్టి ఓంకార్, అరవింద్, కొణతాల సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విలువ నిర్ధారిత కమిటీ అడ్డగింత

అనకాపల్లి రూరల్ : ఎంతో కాలంగా మూతపడిన తుమ్మపాల చక్కెర కర్మాగారంలో తుప్పు పడుతున్న యంత్ర సామగ్రి విలువ నిర్ధారించడానికి గురువారం కర్మాగారానికి వచ్చిన థర్డ్ పార్టీ సభ్యులను రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నేతలు అడ్డుకున్నారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన చక్కెర కర్మాగారాల్లో యంత్ర పరికరాలు, స్క్రాప్, స్టోర్స్‌లో తుప్పు పట్టి పాడైపోతున్నాయి. వీటి విలువ నిర్ధారించడానికి లిక్విడేషన్ కమిటీ డేవిడ్ మక్వాన్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. దీనిలో భాగంగా కర్మాగారానికి వచ్చిన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నేతలు నిరసన తెలిపారు. విలువ నిర్ధారించడానికి వీల్లేదంటూ కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేసి కమిటీ సభ్యులను నిలువరించారు. కేవలం యంత్రాల విలువను మాత్రమే పరిశీలించి విలువ కట్టడానికి వచ్చామని కమిటీ సభ్యులు ఆందోళనకారులకు చెప్పినప్పటికీ వారు ససేమిరా అన్నారు. దీంతో విలువ నిర్ధారణ చేయకుండానే కమిటీ సభ్యులు వెనుదిరిగారు. ఆందోళన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నేతలు ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు, చక్కెర కర్మాగారాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీ నూకేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



గంగునాయుడుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

పరవాడ: నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ వరలక్ష్మి గురువారం శ్రీకారం చుట్టారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ నాయుడుపాలెం గ్రామ పంచాయతీలో ప్రజలకిచ్చిన హామీ మేరకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గంగునాయుడుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, వెంకటపతిపాలెం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.5 లక్షలు, హస్తినాపురం శివారు మండలవారిదొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, దండినాయుడుగారి దొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఖర్చు చేయనున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ కూండ్రపు కృష్ణం నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.